

సాక్షి
పల్నాడు

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



నేడు పోలేరమ్మ తిరునాళ్ల

మంచికల్లు(రెంటచింతల): మంచికల్లు గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఆలయాన్ని పున:నిర్మించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 581.30 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,578 క్యూసెక్కులు విడుదలవుతోంది.



కనుల పండువగా గరుడసేవ

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసిన యోగానంద లక్ష్మీ నరసింహ స్వామికి శుక్రవారం రాత్రి గరుడ సేవ జరిగింది. లోకకల్యాణార్థం స్వామికి గరుడ సేవ నిర్వహించారు.

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా దత్తాత్రేయ జయంతి వేడుకలు



అమరావతి: అమరావతి అమరేశ్వరస్వామి ఆలయంలో శనివారం దత్తాత్రేయుడు, దత్తాత్రేయ పాదాల వద్ద దత్తజయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని మేడి వృక్షం వద్ద మంగిశెట్టి శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్‌ల నిర్వహణలో కౌశిక చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత దత్తాత్రేయుని విగ్రహానికి, పాదాలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి విశేష అలంకారం చేశారు. విఘ్నేశ్వరపూజ, పుణ్యాహావచనంతో మొదలైన ఈ పూజా కార్యక్రమం వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల, భక్తుల నామసంకీర్తనల నడుమ రుద్రహోమం, లక్ష్మీగణపతి చండీహోమం, నవగ్రహ హోమం, దత్తాత్రేయ హోమం నిర్వహించారు. పూర్ణాహుతితో ముగించారు. వేదపండితులు చతుర్వేద ఆశీర్వచనం నిర్వహించి భక్తులకు నీరాజన మంత్ర పుష్పాలను అందించారు. పూజా కార్యక్రమానికి హాజరైన భక్తులందరికి తీర్థప్రసాద వినియోగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిష్టా మహోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించిన అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘానికి నూతన కమిటీ



లక్ష్మీపురం: ఏపీఎస్‌ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 5వ రీజియన్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు రీజియన్ గౌరవ అధ్యక్షుడు మేడా హనుమంతరావు తెలిపారు. కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో శనివారం రీజియన్ మహాసభ నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. కొత్త కమిటీలో అధ్యక్షుడిగా ఎన్. పూర్ణచంద్రరావు, రీజినల్ సెక్రటరీగా కె.శ్రీహరి రాజు, ట్రెజరర్‌గా సయ్యద్ ఖాన్‌తోపాటు 9 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు వివరించారు. అనంతరం నూతన అధ్యక్షుడిని ఘనంగా సత్కరించారు.

కాంట్రాక్ట్ పారా మెడికల్ సిబ్బంది వినతి

తాడేపల్లి రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని ఏపీ కాంట్రాక్ట్ పారా మెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు శనివారం సీఎం చంద్రబాబుకు మంగళగిరిలో టీడీపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.వి.వి. ప్రసాద్ మాట్లాడుతూ మొత్తం 1,700 మంది హెల్త్ అసిస్టెంట్లను ఉద్యోగాల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. నియామక ప్రక్రియలో పొరపాట్లు సరిదిద్దాలన్నారు. విధుల నుంచి తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. విజయవాడలో వరదలలో సేవలు అందించి అనారోగ్యం పాలైన వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో తోట గిరి, గుండుగొలను నాగరాజు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నిక అపహాస్యం

తూతూమంత్రంగా ఎన్నికల ప్రక్రియ

- ఓటరు జాబితా కూడా అందజేయని అధికారులు
- ముందస్తుగా ఉద్యోగులకు ఇవ్వని శిక్షణ
- రాత్రికి ఆర్డర్లు ఇచ్చి ఉదయాన్నే ఉద్యోగం చేయాలన్న ప్రభుత్వం



బొల్లాపల్లి మండలం గండిగనుమలలో ఎన్నికల కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

నరసరావుపేట: అధికార కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలను అపహాస్యం చేసిందనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి. జిల్లాలో ఎక్కడా నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు జరిగిన దాఖలాలు లేవు. ముందుగానే నిర్ణయించుకున్న పేర్లను అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైనట్లు ప్రకటించుకున్నారు. ఈ ఎన్నికలకు కనీసం ఓటర్ల జాబితా కూడా ప్రతిపక్షాలకు అందజేయలేని దుస్థితిలో అధికార యంత్రాంగం ఉంది. ఎవరూ ప్రశ్నించకూడదనే దృక్పథంతో టీడీపీ, జనసేన అనుకూలురు అధికంగా ఉన్న గ్రామాల్లోనే ఎన్నికలు తంతుగా నిర్వహించారు. ఉదాహరణకు నరసరావుపేట మండలానికి సంబంధించి ఎన్నికలను యల్లమంద, రావిపాడు, కాకాని, పమిడిపాడు, కేసానుపల్లి తదితర గ్రామాల్లో నిర్వహించారు. ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వ ఉద్యోగులైన సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీలు, ఎన్ఎస్పీ, రెవెన్యూ ఉద్యోగులకు శుక్రవారం రాత్రి గూగుల్ షీట్లు అందజేసి ఎవరెక్కడ ఎన్నికల ఉద్యోగం చేయాలో చెప్పారు. వారికి ముందస్తుగా కనీసం శిక్షణ కూడా ఇవ్వలేదు. ఒక్కో టీసీకి ఇద్దరు ఉద్యోగులను నియమించి ఉదయాన్నే కేంద్రానికి చేరుకోవాలని ఆదేశించారు. తీరా అక్కడకు వెళ్లిన ఉద్యోగులకు కనీస ఏర్పాట్లు చేయలేదు. ఒక్కో టీసీకి ఇద్దరు వ్యక్తులు రావటం, ఒక వ్యక్తి ప్రతిపాదించటం, మరొకరు ఎన్నికైనట్లు ప్రకటించటం జరిగింది. ప్రభుత్వం ఉద్యోగుల పట్ల అమానుషంగా వ్యవహరించిందనే భావన ఉద్యోగుల్లో ఉంది. కాగా, జిల్లాలో 219 మేజర్, 55 మైనర్ కలిపి మొత్తం 274 సాగునీటి ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. శనివారం డబ్ల్యూయుఏలకు ఎన్నికలు పూర్తికాగా, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎన్నికల ఏర్పాట్లను రెవెన్యూ, జలవనరులశాఖలు ఏర్పాట్లు చేశాయి. నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలో 32 డీసీలు ఉండగా, వాటిలో మాచర్ల, గురజాల, కారంపూడి, చామర్రు, నకరికల్లు, ముప్పాళ్ల, సత్తెనపల్లి, మేడికొండూరు, తంగెడ, బెల్లంకొండ, క్రోసూరు, కేసానుపల్లి, పిడుగురాళ్ల, పెదకూరపాడు, అమరావతి, ఫిరంగిపురం, గుంటూరు, పొన్నెకల్లు, లింగంగుంట్ల, చిలకలూరిపేట-1,2, పెదనందిపాడు, సంతగుడిపాడు, రొంపిచర్ల, గంటావారిపాలెం, వినుకొండ, చీకటీగెలవారిపాలెం, ఐనవోలు, త్రిపురాపురం, ములకలూరు, సంతమాగులూరు, కొమ్మాలపాడు ఉన్నాయి. డీసీల వారీగా రెవెన్యూశాఖ ఓటర్ల జాబితా సిద్ధంచేసింది. జిల్లా వ్యాప్తంగా ఓటర్లుగా పురుష రైతులు 3లక్షలవరకు ఉండగా మహిళా రైతులు ఒక లక్షవరకు ఉన్నారు. వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం కంభంపాడు గ్రామ సాగునీటి సంఘం ఎన్నికల్లో స్వల్ప గర్షణ చోటుచేసుకుంది. తొమ్మిదవ నెంబర్ టీసీకి సంబంధించి పార్టీ నాయకులు ఆమోదించిన పేరు కాకుండా వేరే వ్యక్తిని ఎన్నిక చేశారని అభ్యంతరం వ్యక్తం చేయడంతో కొంతసేపు ఎన్నిక ఆగిపోయింది. ఎమ్మెల్యే జోక్యంతో మరల ఎన్నిక సజావుగా సాగింది. పెదకూరపాడు నియోజకవర్గంలో కూడా అగమ్యగోచరం వ్యక్తమైంది. ఓ టీసీలో తొమ్మిది మంది మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు.



గుండ్లపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై చల్లా సురేష్

ప్రశాంతంగా ఎన్నికలు

జిల్లా వ్యాప్తంగా వాటర్ యూజర్ అసోసియేషన్ (డబ్ల్యూయుఏ)లకు శనివారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా నోడల్ అధికారి, ఎన్ఎస్పీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మురళీధర్ పేర్కొన్నారు. ఎక్కడా వాయిదా పడటం జరగలేదని తెలిపారు. మొత్తం 274 సాగునీటి సంఘాలకు ఏకగ్రీవంగా జరిగాయని చెప్పారు. 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)లకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కన్న కొడుకే కాలయముడు

విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతంగా తీర్చిదిద్దారు.. వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడని ఆశించారు..కానీ అతనే చివరకు తమ ప్రాణాలు తీస్తాడని ఊహించలేకపోయారు ఆ వృద్ధ దంపతులు. బాపట్ల మండలం అప్పికట్లలో ఆస్తి కోసం తల్లిదండ్రులను కొడుకు కిరాతకంగా హత్య చేశాడు. ఈ సంఘటన స్థానికంగా సంచలనం రేపింది.

- ఆస్తి కోసం తల్లిదండ్రుల హత్య
- బాపట్లలో సంచలనం రేపిన ఘటన
- పోలీసుల అదుపులో నిందితుడు



హత్యకు పాల్పడిన కిరణ్ చంద్ర

బాపట్లటౌన్: బాపట్ల జిల్లా బాపట్ల మండలం అప్పికట్ల గ్రామానికి చెందిన పాగోలు విజయభాస్కరరావు (74) హైస్కూలు ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వర్తించి రిటైర్డ్ అయ్యారు. ఆయన తన భార్య వెంకటసాయికుమారి (70)తో కలసి అప్పికట్ల గ్రామంలోని స్వగృహంలో నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమార్తె (లోక కళ్యాణి), కుమారుడు (కిరణ్ చంద్ర) ఉన్నారు. వీరిద్దరికి వివాహం చేశారు. కుమారుడు చీరాలలోని పోస్టాఫీసులో ఉద్యోగం చేస్తున్నాడు. అప్పికట్లలోని తల్లిదండ్రుల వద్దనే ఉంటూ ప్రతిరోజూ చీరాల వెళ్తుంటాడు. కిరణ్ చంద్ర భార్య పిల్లలు విజయవాడలో నివాసం ఉంటున్నారు. కుమార్తె బాపట్లలో నివాసం ఉంటుంది. మృతులకు అప్పికట్ల గ్రామంలో మూడు అంతస్తుల భవనం, విజయవాడలో మరో ఇల్లు, ప్లాట్లు, పొలాలు ఉన్నాయి. మృతుడికి నెలకు రూ. 60 వేలు పెన్షన్, ఇంటి అద్దెలు సుమారు రూ.20 వేలకు పైగా వస్తున్నాయి. ప్రతి నెలా వచ్చిన సొమ్మును కుమార్తెకు పెడుతున్నారు..మీ పేరుతో ఉన్న ఆస్తి మొత్తం నా పేరుతో రిజిస్ట్రేషన్ చేయాలంటూ కొడుకు తరచూ తల్లిదండ్రులతో వాగ్వివాదానికి దిగుతుండేవాడు. ఇప్పటికి రెండు పర్యాయాలు ఆస్తి మొత్తం నా పేరుతో రాయకపోతే మిమ్ములను ఇద్దరిని చంపేస్తానంటూ పలుమార్లు హెచ్చరించారని కుమార్తె లోక కళ్యాణి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

ఆస్తి కోసమే హత్య

ఆస్తిని రాసేందుకు తల్లిదండ్రులు సుముఖత చూపకపోవడంతో ఆగ్రహించిన కుమారుడు శుక్రవారం రాత్రి తల్లిదండ్రులతో తీవ్ర వాగ్వివాదానికి దిగాడు. మేము పోయిన తర్వాత ఆస్తి మొత్తం నీకే కదా వచ్చేది...దాని గురించి ఇప్పుడెందుకు అరుస్తున్నావ్ అంటూ తల్లిదండ్రులు మందలించారు. ఎన్నిసార్లు చెప్పిన వీరు నా మాట వినడం లేదనే అక్కసుతో వీరిని ఎలాగైనా అంతమొందించాలని పథకం పన్నాడు. శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న తల్లిదండ్రులను రోకలిబండతో మోది వారి మోహాలు గుర్తుపట్టని విధంగా నుజ్జునుజ్జు చేసి కిరాతకంగా హత్యచేశాడు. ఈ విషయం తెలుసుకున్న కుమార్తె లోక కళ్యాణి హుటాహుటిన అప్పికట్ల చేరుకుంది. తల్లిదండ్రుల మృతదేహాలను చూసి బోరున విలపించింది. తల్లిదండ్రులను తన సోదరుడు కిరణ్‌చంద్ర హతమార్చాడని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న డీఎస్పీ రామాంజనేయులు, సీఐ హరికృష్ణలు నిందితుడు కిరణ్ చంద్రను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇరువురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. శనివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1902 క్యూసెక్కులు విడుదల చేశారు.బ్యాంక్ కెనాల్‌కు 223, తూర్పు కెనాల్‌కు 82, పశ్చిమ కెనాల్‌కు 51, నిజాంపట్నం కాలువకు 139, కొమ్మమూరు కాలువకు 975 క్యూసెక్కులు విడుదల చేశారు.

ఎయిమ్స్ స్నాతకోత్సవానికి ప్రముఖులు

- హాజరుకానున్న రాష్ట్రపతి ముర్ము, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- 17న నిర్వహణకు అధికారుల ముమ్మర ఏర్పాట్లు

మంగళగిరి: అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ప్రథమ స్నాతకోత్సవం ఈ నెల 17వ తేదీన మంగళగిరిలో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ఐఎస్‌డబ్ల్యూ అధికారి ఆరిఫ్ హఫీజ్ అధికారులు ఏర్పాట్ల తీరును పరిశీలించారు. రాష్ట్రపతి ఎయిమ్స్‌కు చేరుకునే ప్రవేశ ద్వారం నుంచి బస చేసే ప్రాంతం వరకు, ఆడిటోరియంలో జరిగే వేడుకల సందర్భంగా తీసుకోవలసిన భద్రతా చర్యలపై అధికారులకు వారు పలు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఆడిటోరియంలో జరిగే స్నాతకోత్సవానికి ఉదయం 10 గంటలలోపు ఆహూతులు వచ్చేలా ఎయిమ్స్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఫైర్ సేఫ్టీ వెహికల్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. పాల్గొనేందుకు వచ్చే వీఐపీలు, అధికారులు, ప్రముఖుల వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపైనా సూచనలు చేశారు. కార్యక్రమానికి అవసరమైన పబ్లిక్ అడ్రసు సిస్టమ్ ఎల్ఈడీ, లైవ్ టెలీకాస్ట్ పరికరాలు ముందస్తుగానే అమర్చి కండీషన్ సరి చూసుకోవాలన్నారు. అధికారులకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. 162 బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ, రైల్వే గుంతకల్ ఎస్పీ రాహుల్ మీనా, గ్రే హౌండ్స్ ఎస్పీ సునీల్ షరోన్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, ఎయిమ్స్ డెప్యూటీ డైరెక్టర్ శశికాంత్, డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎస్ఓ పి.కోమలి పద్మ, ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ నటరాజ్, అడిషనల్ ప్రొఫెసర్ శంకరన్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ భార్గవ్‌తేజ

పందేనికి సై



ప్రత్యేక షెడ్డులో పెంచుతున్న పందెం కోళ్లు



కోడి పింగల జాతి పుంజు

కోళ్లకు ప్రత్యేక శిక్షణ

- రెండు పూటల వాకింగ్ ఒక పూట స్విమ్మింగ్
- కోడిగుడ్లు, వెండి ఖర్జూరం, జీడిపప్పు మాంసం మెనూ
- పందెపు కోడి రూ.5వేల నుంచి రూ.లక్ష
- గ్రామాల్లో సిద్ధమవుతున్న బరులు

చెరుకుపల్లి : సంక్రాంతి పండుగ అనగానే గుర్తుకు వచ్చేవి కోడి పందేలు, గంగిరెద్దులు, హరిదాసులు. గంగిరెద్దులు, హరిదాసులు కనుమరుగు అవుతున్నా కోడి పందేలకు మాత్రం ఆదరణ తగ్గలేదు. పదేళ్లుగా ప్రతి సంవత్సరం రేపల్లె నియోజకవర్గంలో లక్షలు వెచ్చించి బరులు సిద్ధం చేస్తున్నారు. పందెం రాయుళ్లు పోరుకు కోడి పుంజులను సిద్ధం చేస్తున్నారు. వాటికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. బలానికి ఖరీదైన పోషకాహారాన్ని అందిస్తున్నారు. ఒక్కొక్క కోడి పుంజు ధర రూ.5 వేల నుంచి రూ.లక్ష వరకు పలుకుతోంది.

ప్రత్యేక తర్ఫీదు

పందెం కోళ్ల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కొందరు వారి ఇళ్ల వద్ద, మరికొందరైతే పొలాలు, చెరువు గట్లపై ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు. మంచి జాతి, రంగు ఉన్న పుంజులను ఎంచుకుని వాటికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఉదయాన్నే స్విమ్మింగ్, వాకింగ్ చేయిస్తూ తర్ఫీదు ఇస్తున్నారు. ఐరన్ జాబ్‌లో ఉండే పందెం కోళ్లను ఆరుబయట ఎండలో కట్టేస్తారు. బరిలో చురుగ్గా కదిలేందుకు వీలుగా, కాళ్లలో చురుకుదనానికి సుమారు 20 నుండి 40 రోజులపాటు రోజు విడిచి రోజు దగ్గరలోని కాలువల్లో నీటి తొట్టెల్లో ప్రత్యేకంగా ఈత కొట్టిస్తారు. తరువాత ఖాళీ ప్రదేశాల్లో వాకింగ్ చేయిస్తారు.

బలవర్ధకమైన ఆహారం

పోరుకు సిద్ధమవుతున్న కోడి పుంజులకు ప్రత్యేక ఆహారాన్ని అందిస్తున్నారు. శరీరంలో కొవ్వు చేరకుండా ప్రత్యర్థి పుంజుపై విరుచుకు పడేందుకు, తేలిగ్గా ఎగిరేందుకు వాటికి బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తారు. ఉదయాన్నే గోరు వెచ్చని నీటిని పట్టించి వ్యాయామం చేయిస్తారు. అనంతరం ఎండబెట్టిన గొర్రె పొటేలు మాంసం చిన్న చిన్న ముక్కలు చేసి అందిస్తారు. కోడి గుడ్డు, ఎండు ఖర్జూరం, బాదం, పిస్తా పప్పులు అప్పుడు అప్పుడు పెడుతుంటారు. నాన పెట్టిన రాగులను పుంజులకు పెడుతుంటారు. మేత పెట్టే సమయంలో బయటవారిని ఎవరిని కూడా పుంజులను చూసేందుకు అనుమతించరు. పందెం పుంజును సిద్ధం చేసేందుకు మూడు నెలల్లో రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ఖర్చు అవుతుందని పెంపకం దారులు చెబుతున్నారు.

పందెపు పుంజుల ఖరీదు లక్షల్లోనే....

పందేనికి సిద్ధం చేసే కోడి పుంజు ఖరీదు సుమారు రూ.5వేల నుంచి రూ.లక్షకు పైనే పలుకుతున్నాయి. వాటి జాతిని బట్టి విక్రయిస్తారు. జాతి, రంగును బట్టి ధర పలుకుతుంది. పలువురు పందెం కోసం కోళ్లను సిద్ధం చేసి విక్రయించి లక్షలు గడిస్తున్నారు.



ప్రత్యేక జాతి పుంజులు

కోళ్లలో పచ్చ కాకీ, అబ్రాజ్, డేగ, కేతువ, డేగ పెట్టమార్, ఎర్ర నెమలి, కోడి డేగ, నెమలి పంగలా, కోడి పింగలా ప్రత్యేక జాతులు. రంగును బట్టి అవి ఏఏ సమయాల్లో పందెం గెలుస్తాయో తెలుసుకుని ఆయా సమయాల్లో మాత్రమే బరిలో దింపతారు.

దుర్గమ్మకు జ్యోతుల శోభ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దారులన్నీ దుర్గమ్మ సన్నిధికే చేరాయి.. జ్యోతి కాంతులు జగజ్జననికి నీరాజనాలు పట్టాయి. భక్తుల శరణు ఘోషతో ఇంద్రకీలాద్రి పరిసరాలు పులకించాయి. కనకదుర్గమ్మకు శనివారం నిర్వహించిన జ్యోతుల ఉత్సవం అంగరంగ వైభవంగా సాగింది. మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు భవానీలు, భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జ్యోతులను సమర్పించారు. సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రం నుంచి ఇంద్రకీలాద్రికి వరకు నిర్వహించిన జ్యోతుల ఉత్సవంలో నగరానికి చెందిన భవానీలతో పాటు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోకి పలు గ్రామాలకు చెందిన భవానీలు విశేషంగా తరలివచ్చి అమ్మవారికి జ్యోతులతో మొక్కులు చెల్లించుకున్నారు.

ఉత్సవ మూర్తులకు పూజలు

శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రీ గంగ, పార్వతి సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు దుర్గగుడి ఈఓ కె.ఎస్.రామరావు, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సప్తవర్ణ పుష్పాలతో దేదీప్యమానంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఉత్సవ మూర్తులు అధిష్టించగా, పూజాది కార్యక్రమాల నిర్వహించిన అనంతరం ఊరేగింపును ప్రారంభించారు. వందలాది మంది భవానీలు, భవానీ భక్తులు అమ్మవారి నామస్మరణ చేసుకుంటూ ఇంద్రకీలాద్రికి పయనమయ్యారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు జ్యోతులతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఆలయ గురు భవానీ నాగరాజు, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝల శ్రీనివాసశాస్త్రి, ఈఈ వైకుంఠరావు, కోటేశ్వరరావు, దేవస్థానం ఇంజినీరింగ్, ఫెస్టివల్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జ్యోతుల ఉత్సవంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. కొమ్ము బూరలు, డప్పు నృత్యాలు, చిన్నారుల కోలాట నృత్యాలు, పలువురు కూచిపూడి, భరత నాట్య కళాకారులు తమ నృత్యాలను ప్రదర్శించారు. జ్యోతులతో పాటు ఆయా బృందాలు ముందుకు సాగగా, జ్యోతులు మార్గంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. ఊరేగింపులో దేవస్థాన ప్రచార రథం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



జ్యోతుల సమర్పణ

దేవస్థానం నిర్వహించిన జ్యోతుల ఉత్సవంలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి గురు భవానీల సారథ్యంలో భవానీలు, భక్తులు జ్యోతులను చేబూని ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. నగరంలో ప్రధాన రహదారులన్నీ ఇంద్రకీలాద్రికే మళ్లించారా అనే రీతిలో జ్యోతుల ఉత్సవం సాగింది. కనకదుర్గనగర్‌కు చేరుకున్న భవానీలు దేవస్థానం నిర్దేశించిన ప్రదేశంలో అమ్మవారి ఉత్సవ మూర్తికి జ్యోతులను సమర్పించారు.

లైంగికదాడి కేసులో నిందితులకు రిమాండ్

- విచారణ చేపట్టిన డీఎస్పీ
- కరకట్ట వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు

కొల్లూరు: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులకు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు కొల్లూరు ఎస్ఐ జి.ఏడుకొండలు శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికపై గత నెల 26న మండలానికే చెందిన ఆవులవారిపాలెం శివారు క్రీస్తులంకకు చెందిన ఇరువురు లైంగికదాడికి పాల్పడిన విషయం విదితమే. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటనపై ఈనెల 12న రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. క్రీస్తులంకకు చెందిన విప్పర్ల ప్రేమ్‌కుమార్, బెజ్జం శ్యామ్‌కుమార్‌లు బాలికను బెదిరించి ఇటుక బట్టీల్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేమూరు సీఐ పీవీ.ఆంజనేయులు, కొల్లూరు ఎస్ఐ ఏడుకొండలు శుక్రవారం రాత్రి కొల్లూరు లాక్ సెంటర్ కరకట్ట వద్దనున్న బస్టాండ్‌లో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను శనివారం తెనాలి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

279 కేసులు పరిష్కారం

నరసరావుపేటటౌన్: జాతీయ లోక్ అదాలత్‌లో 279 కేసులు పరిష్కారం కాగా, కక్షిదారులకు రూ. 3.40 కోట్లు పరిహారం లభించిందని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి, లోక్ అదాలత్ చైర్మన్ ఎన్. సత్యశ్రీ తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం అదాలత్ నిర్వహించారు. అదాలత్‌లో క్రిమినల్ 181, సివిల్ 24, చెల్లని చెక్కు 45, మోటార్ వాహనాలకు సంబంధించి 11, మనోవర్తి 18 కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారమయ్యాయి. అదాలత్‌లో న్యాయ మూర్తి టి.ప్రవల్లిక, అదాలత్ సభ్యులు, న్యాయవాదులు బ్లెసీనా, సురేష్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ

ఘటనలో 14నెలల చిన్నారి మృతి

ఈపూరు(శావల్యాపురం): మండలంలోని కూచినపల్లి గ్రామ సమీపాన శనివారం ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు అతి వేగంతో ఢీకొన్న ఘటనలో 14 నెలల చిన్నారి మృతి చెందగా ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈపూరు ఎస్ఐ యం.ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాదు నుంచి వినుకొండ రూరల్ పరిధిలోని తమ స్వగ్రామమైన చాత్రగడ్డపాడుకు ఆళ్ళ బ్రహ్మారెడ్డి కుటుంబ సభ్యులు శుభకార్యం నిమిత్తం కారులో బయలుదేరారు. ఈ క్రమంలో ఈపూరు నుంచి కారెంపూడికు బయలుదేరిన మరో కారు మార్గమధ్యంలో ఎదురుగా వచ్చి ఢీకొంది. ప్రమాదం ధాటికి రహదారికి ఇరువైపులా రెండు కార్లు వెళ్లాయి. ఈప్రమాదంలో బ్రహ్మారెడ్డి కుటుంబ సభ్యులకు తీవ్ర గాయాలు కాగా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ చిన్నారి తప సారధ్య మృతి చెందింది. తల్లి లక్ష్మి కుమారికు ఎడమ కాలి ఎముక విరగ్గా, పాప మేనత్తకు స్వల్ప గాయాలు అయినట్లు ఎస్ఐ తెలిపారు. ఈప్రమాదంలో రెండు కార్ల ముందుభాగం పూర్తిస్థాయిలో దెబ్బతినగా సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధురాలు మృతి



అద్దంకి రూరల్: రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని బైక్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అందిన వివరాల మేరకు.. అద్దంకి పట్టణంలోని మౌలానగర్ జెండా చెట్టు వద్ద నివాసం ఉంటున్న హుస్సేన్ బీ (65) వంట పనులు చేస్తుంటుంది. ఈ నేపథ్యంలో శనివారం మండలంలోని చక్రాయపాలెం గ్రామంలో పని ముగించుకుని అద్దంకి–నార్కట్‌పల్లి హైవే వద్దకు చేరుకుంది. అద్దంకి వైపు వచ్చేందుకు ఆటో కోసం రోడ్డు దాటుతుండగా బైకు ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయమవటంతో అక్కడికక్కడే మృతి చెందింది.

రేపటి నుంచి

ధనుర్మాస వ్రత ఉత్సవాలు

మంగళగిరి: ఆత్మకూరు బాపూజీ విద్యాలయం ప్రాంగణంలో ఈ నెల 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాస వ్రత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వైటీఆర్ ట్రస్ట్ చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్ తెలిపారు. శనివారం బాపూజీ విద్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... త్రిదండి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలతో వేడుకలు 16న సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. లైలా గ్రూప్స్ చైర్మన్ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ.. అమరావతిలో ఉత్సవాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ పాల్గొంటారన్నారు. రోజూ భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. సమావేశంలో క్రేన్ సంస్థల చైర్మన్ గ్రంధి కాంతారావు, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సెక్రటరీ శ్రీ కూర్మానాథస్వామి, సీతానగరం జీయర్ ఆశ్రమ ప్రతినిధులు పురాణం వెంకటాచార్యులు, మధుసూదనాచార్యులు, సధిమేల రఘునాథ్, రిటైర్డ్ డీఐజీ వెంకటస్వామి, ధ్యానమండలి ప్రతినిధులు అకురాతి శంకరరావు, లక్ష్మి, వికాస తరంగణి ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఉన్నత స్థానాలకు..

- పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్
- స్కూల్‌గేమ్స్ అండర్–19 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు ప్రారంభం

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సత్తెనపల్లి మండలంలోని ధూళిపాళ్ళ లయోలా ఇంజినీరింగ్ కళాశాలలో స్కూల్‌గేమ్స్ అండర్–19 బాలబాలికల రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కళాశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పోటీలను ప్రారంభించారు. కార్యక్రమానికి లయోలా కళాశాల డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా డీవీఈఓ జె.పద్మ, గుంటూరు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ తాళ్ళ వెంకటేష్ యాదవ్, పల్నాడు సెపక్‌తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు డా.వడ్డెంపూడి పవన్‌కుమార్, ఖోఖో అసోసియేషన్ చైర్మన్ దాసరి కోటేశ్వరరావు, గుంటూరు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు, సహాయ కార్యదర్శి పద్మాకర్, గవర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శివరామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు సీహెచ్ భానుమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



పోటీలో తలపడుతున్న గుంటూరు-విశాఖపట్నం జిల్లా జట్లు

బాలుర లీగ్ మ్యాచ్ ఫలితాలు...

తూర్పుగోదావరి జిల్లా జట్టుపై నెల్లూరు జట్టు 6-2 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ప్రకాశంపై అనంతపురం 6–0, చిత్తూరుపై కర్నూలు 7–1, కృష్ణా జిల్లా జట్టుపై విజయనగరం జిల్లా జట్టు 7–6 తేడాతో విజయం సాధించాయి.

బాలికల లీగ్ మ్యాచ్ ఫలితాలు...

కృష్ణా జిల్లా జట్టుపై విజయనగరం జిల్లా జట్టు 7–6 పాయింట్లు తేడాతో విజయం సాధించింది. కర్నూలుపై పశ్చిమగోదావరి 9–8, ప్రకాశంపై శ్రీకాకుళం 6–0, విశాఖపట్నం జిల్లా జట్టుపై గుంటూరు జిల్లా జట్టు 8–0 పాయింట్లు తేడాతో విజయం సాధించింది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలు



నరసరావుపేట ఈస్ట్: క్రీడా స్ఫూర్తిని అలవరుచుకున్న విద్యార్థి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదుగుతాడని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వాగ్దేవి డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు ప్రారంభించారు. కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అసోసియేషన్ కార్యదర్శి ఎం.సుబ్బరాజు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుంచి 24వ తేదీవరకు రావులపాలెంలో నిర్వహించనున్న 50వ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ టోర్నమెంట్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. జట్ల ఎంపికలో భాగంగా బాల బాలికల విభాగాల నుంచి 18మంది చొప్పున ఎంపిక చేశామన్నారు. వీరికి వాగ్దేవి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేసి టోర్నమెంట్‌కు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరావు, పాశం కృష్ణారావు, పోటు అచ్యుతరావు, జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి సురేష్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ వై.చిరంజీవి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారం తొలగించాలి

సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దహనం

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): విద్యుత్ చార్జీల భారం తొలగించాలని, స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల పేర్కొన్నారు. పట్టణంలోని 8వ వార్డులో శనివారం పర్యటించి విద్యుత్ వినియోగదారులతో కలిసి విద్యుత్ బిల్లులను దహనం చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకునే వరకు సీపీఎం ఉద్యమం చేపడుతుందన్నారు. రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం రూ.18వేల కోట్లు సర్ చార్జీల రూపంలో ప్రజల నెత్తిన రుద్దిందన్నారు. స్మార్ట్ మీటర్లు వినియోగంలోకి వస్తే పెరిగిన చార్జీల ప్రకారం రీచార్జ్ చేయించుకోవాల్సివస్తుందని, బ్యాలెన్స్ అయిపోతే కరెంటు అకస్మాత్తుగా సరఫరా నిలిచిపోతుందన్నారు. కరెంటు కావాలనుకుంటే మళ్లీ రీచార్జ్ చేయించుకోవాల్సి వస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లు వినియోగదారుల పాలిట శాపమని, మొత్తం కాంట్రాక్ట్ అదానీ కంపెనీకి ఇచ్చారన్నారు. మొత్తం లక్షలాది రూపాయలు అదానీకి సమకూర్చేందుకు ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. ఈ వినాశకర విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఎం ఉద్యమం చేపడుతుందన్నారు. ఈ ఉద్యమంలో ప్రజానీకం అంతా పాల్గొని తమ నిరసనను తెలియజేయాలన్నారు. సీపీఎం నాయకులు జడ రాజ్‌కుమార్, షేక్ మస్తాన్‌వలి, రొంపిచర్ల పురుషోత్తం, గడ్డం హనుమంతురావు, కోరంపల్లి జగన్, స్థానికులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న వినియోగదారులు

బస్సులను సమయానికి నడపండి

ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.అప్పలరాజు

తెనాలి అర్బన్: ఆర్టీసీ బస్సులను అధికారులు ప్రకటించిన సమయానికి నడపాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.అప్పలరాజు ఆదేశించారు. తెనాలి డిపోను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దూరం ప్రాంతాల బస్సులు సమయానికి డిపో నుంచి బయలుదేరితే మధ్యలో ఉన్న పికప్ పాయింట్‌ల వద్ద కొద్దిసేపు నిలిపే అవకాశం ఉందన్నారు. ఇలా చేయడం వల్ల ఎక్కువ మంది పాసింజర్లు ప్రయాణించే అవకాశం ఉంటుందని చెప్పారు. సమయ పాలన మాసోత్సవాలు ఒక నెలకు పరిమితం చేయకూడదని, ఇది నిరంతరం ప్రక్రియ అని చెప్పారు. ప్రయాణికులతో ఉద్యోగులందరూ మర్యాదపూర్వంగా వ్యవహరించాలన్నారు. చెయ్యి ఎత్తిన చోట బస్సులు ఆపాలని సూచించారు. అనంతరం అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీపీటీఓ ఎం.రవికాంత్, డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ఐ.జయప్రసాదరావు, అసిస్టెంట్ మెకానిక్ ఇంజినీర్ అభిరామ్ నాయక్, ఏసీ మెకానిక్ జోషిబాబు, కె.ఎస్.కృష్ణ పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలు అందుకున్న ఉద్యోగులతో ఈడీ అప్పలరాజు, డీపీటీఓ రవికాంత్, డీఎం రాజశేఖర్

యూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: కాకినాడలో వచ్చే ఏడాది జనవరి 5, 6, 7, 8 వ తేదీల్లో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని సంఘ జిల్లా కార్యాలయంలో శనివారం సభల ఆహ్వాన పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... యూటీఎఫ్ స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో కాకినాడలోని పీఆర్ డిగ్రీ కళాశాలలో స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో కీలక భూమిక పోషించడంతోపాటు, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు నిరంతరం యూటీఎఫ్ కృషి చేస్తోందన్నారు. విద్యాసదస్సుతోపాటు ఉద్యమ, సాహితీ, మహిళా సదస్సులను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రత్యామ్నాయ విద్యావిధానంపై చర్చించి, తీర్మానాలు ఆమోదిస్తామని తెలిపారు. పలు పార్టీల నాయకులు, సాహితీ వేత్తలు, విద్యారంగ ప్రముఖులు, మహిళా నాయకులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమ కుమారి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజ శేఖరరావు, ఎం.కళాధర్, జిల్లా కార్యదర్శులు జి. వెంకటేశ్వరరావు, ఎండీ షకీలా బేగం, ఎ. శ్రీనివాసరావు, కె. రంగారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.శ్రీనివాస్ కార్తీక్, షేక్ బాజీబాబా పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో విజయవంతంగా అరుదైన ఆపరేషన్



రోగితో వైద్యులు యశస్వి రమణ, కిరణ్‌కుమార్, గోవిందనాయక్ తదితరులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రోగికి అరుదైన ఆపరేషన్ విజయవంతంగా చేసినట్లు జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గోవిందనాయక్ చెప్పారు. శనివారం ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు మీడియాకు వెల్లడించారు. గుంటూరు రూరల్ మండలం దాసరిపాలెంకు చెందిన షేక్ మొహమ్మద్ టింబర్ డిపోలో పనిచేసేవాడు. మెడ భాగంలో అరుదైన ట్యూమర్ వచ్చిందని, షానోమాగా నిర్ధారించామన్నారు. ఈ నెల 6న ఆపరేషన్ చేశామని తెలిపారు. ఆపరేషన్ సమయంలో ట్యూమర్ వేగస్ నరం నుంచి కాకుండా బేస్ ఆఫ్ ది స్కల్ దగ్గర ఉన్న ఫ్రానిక్ నరం నుంచి వచ్చినట్లు గుర్తించామన్నారు. మూడు గంటల సేపు ఆపరేషన్ విజయవంతంగా చేశామన్నారు. సుమారు రూ. 5 లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా చేసినట్లు తెలిపారు. మత్తు వైద్యులు డాక్టర్ పోలయ్య, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ హేమలు పాల్గొన్నట్లు వెల్లడించారు. వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అభినందించారు.